# వైద్యులారా వందనం



**వనం నాగయ్య, కెరటం న్యూస్**

నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్. బిదన్ చంద్ర రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్రీ శ్రీనివాసం దంత వైద్యశాల డాక్టర్ ఎం ప్రదీప్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చిత్రపటానికి నివాళు లు అర్పించిన అనంతరం డాక్టర్ ఎం ప్రదీప్ కుమార్ విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. చిన్న వయసు నుంచే శారీరక ఆరోగ్యం పట్ల విద్యార్థిని విద్యార్థులు సరైన అవగాహన కలిగి ఉండాలని, నోరు, దంతాలు అనేవి మనిషి యొక్క ఆరోగ్యంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయని అన్నారు. కాబట్టి విద్యార్థిని విద్యార్థులు దంత సంరక్షణ కోసం సరైన పద్ధతిలో చర్యలు చేపట్టాలని అన్నారు. అలాగే హానికరమైన బ్యాక్టీరియా వైరస్ లాంటి సూక్ష్మ క్రిములు నోటి ద్వారానే మానవ శరీరంలోనికి ప్రవేశిస్తాయని దాన్ని అదుపు చేయడం కోసం తరచూ నోటిని శుభ్రం చేసుకోవాలని బ్యాక్టీరియా కారణంగా దంతాల సమస్యలు ఏర్పడతాయని చిగుళ్ల వాపు చిగుళ్ళ నుంచి రక్తం కారటం మొదలైన సమస్యలు తీరాలంటే ఎల్లప్పుడూ మన యొక్క దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మానవ జీవితం అనేకమైన అనారోగ్య సమస్యల వలయంలో చిక్కుకుని సతమతమవుతున్నప్పుడు ఆ శారీరక రుగ్మతలను తగ్గించి మన ఆరోగ్యాన్ని కాపాడే వైద్యులకు మనమందరం ఎల్లప్పుడూ రుణపడి ఉండాలని, మన ఆరోగ్యాన్ని కాపాడే వైద్యులే మన పాలిటి దైవాలుగా వారిని గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, శ్రీదేవి, క్యాంపస్ ఇంచార్జ్ సందీప్ పాల్గొన్నారు.

# 'సంకల్ప' హాస్పిటల్‌లో ఘనంగా డాక్టర్స్‌డే

**తిరుపతి టౌన్, కెరటం న్యూస్ ప్రతినిధి**

ఆయువు పోసేది కనిపించని ఆ దేవుడైతే... ఆ ప్రాణాలు నిలిపే ప్రత్యక్ష దైవమే వైద్యుడని తిరుపతిలోని సంకల్ప హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు డా.నాగరాజు, డా.అనంత్(మెడికల్ డైరెక్టర్), సోమేశ్వర్ బండ్ల (బిజినెస్ డైరెక్టర్) అన్నారు. సోమవారం సంకల్ప హాస్పిటల్‌లో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా జరుపు కున్నారు. ఈ సందర్భంగా డా.నాగరాజు, డా.అనంత్, సోమేశ్వర్ మాట్లాడుతూ... వైద్యుడిని భగవత్ స్వరూపులంటారని అన్నారు. మృత్యువు అంచుల దాకా వెళ్లిన ఎందరికో ప్రాణాలు పోసే శక్తి ఒక్క వైద్యుడికి మాత్రమే ఉంటుందనడంలో అతిశయోక్తి లేదన్నారు. అందుకే ప్రాణదాతలైన వైద్యులకు సమాజంలో అత్యున్నత గౌరవం లభిస్తుంది. ఈ కారణంగానే వైద్య వృత్తి ఎంతో పవిత్ర స్థానంలో నిలిచిందని వారు అన్నారు. వైద్యుల త్యాగనిరతి అంతా ఇంతా కాదు. అది అపూర్వమనే చెప్పాలి. వ్యక్తిగత జీవితాన్ని సైతం పక్కకు నెట్టి వృత్తికి అమితమైన ప్రాధాన్యతనిచ్చేది ఒక్క వైద్యుడు మాత్రమేనని వారు తెలిపారు. వైద్యుల దినత్సోవానికి ఆధ్యుడైన డాక్టర్ బీసీ రాయ్ (బిదాన్ చంద్ర రాయ్). ఈయన 1882 జూలై 1వ తేదీన పుట్టి 1962 జూలై 1వ తేదీన తుది శ్వాస విడిచారు. ఆయన గౌరవార్ధం జూలై ఒకటవ తేదీన మన దేశంలో జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. భారత్‌లో వైద్య రంగానికి బీసీ రాయ్ విశేష సేవ చేశారనీ, పాట్నా వద్ద ఉన్న బంకిపూర్లో జన్మించిన రాయ్ గొప్ప రాజకీయ వేత్త, మానవతావాది. రాయ్ ప్రసిద్ధిగాంచిన వైద్యుడిగానే కాకుండా పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 1948 నుంచి 1962 మధ్య రెండవ ముఖ్యమంత్రిగా పని చేశారని గుర్తుచేశారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర రూపశిల్పిగా గుర్తింపు పొందారు. దుర్గాపూర్, కళ్యాణి, బిదాన్ నగర్, అశోక్ నగర్, హబ్రా వంటి నగరాలను బెంగాల్లో మిగతా ప్రాంతాలకు తలమానికంగా తీర్చిదిద్దారు. డాక్టర్ బీసీ నాయకుడిగా రాయ్ స్వాతంత్ర్యోద్యమ నాయకుడిగా సేవలందిస్తూనే విభిన్న రంగాల్లో తనదైన ముద్ర వేసుకున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సంకల్ప హాస్పిటల్ సిబ్బంది, మేనేజ్‌మెంట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు.

